ఘోరం!


ప్రమాదంలో మరణించినవారు (ఫైల్‌ఫొటో)

- ఆస్పత్రిలో ఉన్న బంధువును పరామర్శించి వెళ్తుండగా ప్రమాదం
- ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురి దుర్మరణం


ఘటనా స్థలంలో కారు శిథిలాల నుంచి మృతదేహాలను వెలికి తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

చెన్నై, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బంధువును చూసేందుకు చెన్నై వచ్చి తిరిగి తమ స్వస్థలానికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతిచెందారు. కడలూరు జిల్లా చిదంబరం సమీపం పరంగిపేట వద్ద గురువారం వేకువజామున జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి వివరాలిలా... మైలాడుదురై జిల్లా కుత్తాలం సమీపం నక్కంబాడి గ్రామానికి చెందిన మహమ్మద్ అన్వర్ (56)కు చెందిన బంధువు దుబాయ్‌లో తీవ్ర అనారోగ్యానికి గురై స్వదేశానికి తిరిగొచ్చి చికిత్స కోసం చెన్నైలోని ఆస్పత్రిలో చేరారు. ఆయనను చూడటానికి అన్వర్ తన కుటుంబంతో కలిసి కారులో బుధవారం చెన్నై వచ్చారు. చికిత్స పొందుతున్న బంధువును పరామర్శించిన అనంతరం అన్వర్ తన కుటుంబ సభ్యులతో కలిసి రాత్రి పది గంటల తర్వాత కారులో స్వస్థలానికి బయలుదేరారు. కారును కుంభకోణం సమీపం కొరనాట్టుకరుప్పూరుకు చెందిన యాసర్ అరాఫత్ (38) నడుపుతుండగా, నక్కంపాడి గ్రామానికి చెందిన హజీరా బేగం (65), తిరుమంగళం గ్రామానికి చెందిన అరాఫత్ నిషా (27), ఆమె కుమారుడు అబ్‌నాన్ (3) ఉన్నారు. గురువారం వేకువజాము 3 గంటలకు చిదంబరం సమీపం పి ముట్లూరు ఫ్లైఓవర్ వద్ద ఎదురుగా వచ్చిన లారీ అదుపుతప్పి కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఐదుగురూ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించారు. ఈ ప్రమాదం గురించి సమాచారం అందటంతో పరంగిపేట పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని కారు శిథిలాల మధ్యచిక్కుకున్న మృతదేహాలను వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తంకు తరలించారు. ఈ ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారవగా, అతడి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.


సహాయక చర్యలు పరిశీలిస్తున్న అగ్నిమాపక అధికారులు

లేడీస్ హాస్టల్‌లో అగ్నిప్రమాదం

- ఇద్దరు మహిళల మృతి

చెన్నై, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేటు హాస్టల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో విషాదం చోటుచేసుకుంది. అందులో ఉంటున్న మహిళలను రక్షిస్తూ ఇద్దరు ఉపాధ్యాయులు కన్నుమూయడం పలువురిని కలిచివేసింది. వివరాలిలా.... మదురైలోని ఓ లేడీస్ హాస్టల్‌లో గురువారం వేకువజామున సంభవించిన అగ్ని ప్రమాదంలో ఇద్దరు ఉపాధ్యాయులు మృతిచెందగా, పలువురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మదురై పెరియార్ బస్‌స్టేషన్‌కు సమీపంలో కట్రాపాళయం ప్రాంతం లో రెండంతస్థుల భవనంలో ఓ ప్రైవేటు లేడీస్ హాస్టల్ నడుపుతున్నారు. ఆ హాస్టల్‌లో వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్న సుమారు 50 మంది మహిళలు బసచేస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం వేకువజాము ఆ భవనం మొదటి అంతస్థులోని ఓ గదిలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఫ్రిడ్జ్ పేలిపోయింది. దీంతో ఆ భవనం అంతా దట్టమైన పొగలు వ్యాపించి మంటలు చెలరేగాయి. గదుల్లో ఉన్నవారి బట్టలు, బ్యాగులకు నిప్పంటుకుని నలువైపులా మంటలు వ్యాపించాయి. వాడిపట్టిలోని ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న పరిమళాసుందరి (50), శరణ్యా (22) అదే ఇద్దరు మంటల్లో చిక్కుకుని దుర్మరణం చెందారు.

పలువురిని కాపాడి మృతి చెందిన టీచర్..


టీచర్
పరిమళా సుందరి
(ఫైల్‌ఫొటో)

ఈ అగ్ని ప్రమాదంలో మృతి చెందిన ఉపాధ్యాయురాలు పరిమళాసుందరి మంటలు, పొగలు నడుమ చిక్కుకున్న పలువురిని కాపాడి ప్రాణాలు కోల్పోయిన సంఘటన స్థానికులకు కంటతడిపెట్టించింది. హాస్టల్ భవనం మొదటి అంతస్థులో అగ్ని ప్రమాదం సంభవించడంతో మంటలు, పొగలు రెండో అంతస్థుకు వ్యాపించకుండా మొదటి అంతస్థు తలుపులను మూసివేశారు. రెండో అంతస్థులో ఉన్నవారంతా డాబాపైకి చేరుకుని ప్రాణగండం నుండి తప్పించుకున్నారు. ఇక అగ్ని ప్రమాదం సంభవించిన మొదటి అంతస్థులో చిక్కుకున్న ఉపాధ్యాయులు పరిమళా సౌందరి గదిలో నిద్రపోతున్న వారందరిని తట్టిలేపి వెళ్ళిపొమ్మంటూ కేకలు పెట్టారు. గదుల్లో దట్టంగా పొగ కమ్ముకోవడంతో వారంతా పరిమళా సౌందరి సాయంతో టార్చిలైట్ వెలుతురులో బయటపడ్డారు. అలా పదిమందికిపైగా మహిళలను సకాలంలో కాపాడిన ఆ ఉపాధ్యాయురాలు పొగ మధ్య ఊపిరాడక మృతి చెందారు. ఇదే విధంగా పొగ మధ్యలో చిక్కుకుని మరో ఉపాధ్యాయురాలు శరణ్య కూడా ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో గాయపడిన ముగ్గురు మహిళలను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదం గురించి సమాచారం అందగానే డిడీర్‌నగర్ అగ్నిమాపక దళం హుటాహుటిన చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ సంఘటనపై డిడీర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. ఇదిలా ఉండగా అగ్ని ప్రమాదానికి గురైన లేడీస్ హాస్టల్ భవనం అత్యంత ప్రాచీనమైనదని, ఆ భవన సముదాయాన్ని కూల్చివేయమంటూ యేడాది క్రితం మదురై మహానగర కార్పొరేషన్ అధికారులు నోటీసులు కూడా ఇచ్చారని తెలిసింది. అగ్నిప్రమాదానికి గురైన ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ సంగీత అధికారులతో కలిసి పరిశీలించారు. మదురై మీనాక్షి అమ్మవారి ఆలయం చుట్టూ ఉన్న ప్రాచీన భవనాలను కూల్చివేయాలని ఇదివరకే కార్పొరేషన్ అధికారులు పలుమార్లు వాటియజమానులకు నోటీసులు ఇచ్చారని, కొందరు కోర్టుకు వెళ్ళారని ఆమె తెలిపారు. ఈ పరిస్థితులలో అగ్నిప్రమాదానికి గురైన భవనాలు బలహీనంగా ఉన్నాయని, వాటిని కూల్చివేయాలని కార్పొరేషన్ నోటీసులిచ్చినా పట్టించుకోకుండా లేడీస్ హాస్టల్ నడిపారని ఆమె ఆరోపించారు. అగ్ని ప్రమాదానికి గురైన ఈ భవనాన్ని త్వరలో కూల్చివేసేందుకు చర్యలు చేపడతామని కలెక్టర్ పేర్కొన్నారు.

రూ.500 కోట్లతో కేటర్ పిల్లర్

- స్టాలిన్ సమక్షంలో కుదిరిన ఒప్పందం
- రూ.7516 కోట్లకు పెరిగిన పెట్టుబడులు


చికాగోలో ముఖ్యమంత్రి సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకున్న కేటర్ పిల్లర్ కంపెనీ ప్రతినిధులు, ప్రభుత్వ ప్రతినిధులు

చెన్నై, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఆరేళ్లలో రాష్ట్రాన్ని ఒన్ ట్రిలియన్ డాలర్ల మేర ఆర్థిక ప్రగతి సాధించే విధంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో విదేశీ పెట్టుబడుల సమీకరణ కోసం అమెరికాలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్ బుధవారం రాత్రి కేటర్‌పిల్లర్ సంస్థ ప్రతినిధులతో చర్చలు జరిపారు. అమెరికాలోని టెక్సాస్ నగరంలో ప్రధాన కార్యాలయంగా కేటర్ పిల్లర్ సంస్థ నిర్మాణం, సొరంగ తవ్వే పరికరాలు, ఆఫ్ - హైవే డీజిల్, సహజసిద్ధ ఇంధన యంత్రాలు, డీజిల్, ఎలక్ట్రిక్ ఇంజన్ల తయారీలో పేరుగడించింది. ఈ నేపథ్యంలో ఆ కంపెనీ డైరెక్టర్ భువన్ అనంతకృష్ణన్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గెర్సి ఎఫ్లర్ ఇతర అధికారులతో ముఖ్యమంత్రి స్టాలిన్ జరిపిన చర్చలు ఫలించడంతో కేటర్ పిల్లర్ సంస్థ రాష్ట్రంలో రూ.500 కోట్ల మేర పెట్టుబడులు పెట్టేందుకు అంగీకరించింది. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కూడా కుదుర్చుకుంది. ఆప్రకారం తిరువళ్లూరు, కృష్ణగిరి జిల్లాలోని కేటర్ పిల్లర్ భవన నిర్మాణ పరికరాల ఉత్పత్తి కర్మాగారాల్లో విస్తరణ కార్యకలాపాల కోసం రూ.500 కోట్ల పెట్టుబడి సమకూర్చనుంది. ప్రస్తుతం అమెరికా పర్యటనలో భాగంగా శాన్‌ఫ్రాన్సిస్కో, చికాగో నగరాలలో అంతర్జాతీయపెట్టుబడీ దారుల సదస్సులలో పాల్గొన్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ప్రభుత్వ ఉన్నతాధికారుల చొరవ కారణంగా ఇప్పటివరకూ 16 కంపెనీలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఆ ఒప్పందాల ప్రకారం రూ.7516 కోట్ల మేరకు పెట్టుబడులు సమీకరించినట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ అధికారికంగా ప్రకటించారు. సమావేశంలో స్టాలిన్‌తో పాటు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా, పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహక వాణిజ్య శాఖ కార్యదర్శి వి.అరుణ్‌రాయ్, పారిశ్రామిక మార్గదర్శక సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వి.విష్ణు తదితరులు పాల్గొన్నారు.

టాస్మాక్‌కు సీఎం ఎప్పుడూ వ్యతిరేకమే

- దశలవారీగా మద్యనిషేధం అమలు
- మంత్రి ముత్తుస్వామి



ప్యారీస్, సెప్టెంబరు 12: రాష్ట్రంలో టాస్మాక్ మద్యం దుకాణాలను కొనసాగించేందుకు ముఖ్యమంత్రి స్టాలిన్ ఇష్టపడడం లేదని, ఆ దుకాణాలన్నింటినీ మూసివేసే క్షణం కోసం ఎదురుచూస్తున్నారని, సంపూర్ణ మద్యనిషేధమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర హౌసింగ్, ఎక్సైజ్ శాఖ మంత్రి ఎస్.ముత్తుస్వామి పేర్కొన్నారు. రాష్ట్రంలో సంపూర్ణ మద్యనిషేధ చట్టాన్ని అమలు పరచాలని కోరుతూ అక్టోబరు 2న కళ్లకుర్చిలో డీపీఐ ఆధ్వర్యంలో మహానాడు నిర్వహించనున్నారు. ఇందులో పీఎంకే, బీజేపీ మినహా ఏకాభిప్రాయం కలిగిన పార్టీలన్నీ పాల్గొనవచ్చని డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్ పిలుపిచ్చారు. అందులో భాగంగానే ప్రతిపక్ష అన్నాడీఎంకేను ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో, మంత్రి ముత్తుస్వామి గురువారం మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో సంపూర్ణ మద్యనిషేధంపై ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని ప్రభుత్వం పరిశీలిస్తోందని, టాస్మాక్ దుకాణాలను కొనసాగించాలన్న ఉద్దేశం స్టాలిన్‌కు లేదన్నారు. అనుకూల పరిస్థితులను బట్టి ఏదో ఒకరోజు మద్యం దుకాణాలను మూసివేస్తామని, మద్యం దుకాణాలకు వ్యతిరేకంగా డీపీఐ నిర్వహించనున్న మహానాడు వల్ల ప్రభుత్వానికి ఎలాంటి ఇబ్బంది రాదన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఎవరైనా ఒక కోరికతో మహానాడు నిర్వహించే హక్కుందని, డీపీఐ మహానాడు కూడా ఈ కోవలోకి వస్తుందన్నారు. ఖాళీ మద్యం సీసాలు వెనక్కి తీసుకొనే విషయమై మద్యం ఉత్పత్తుల సంస్థలతో చర్చలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో కోర్టు సలహాను పాటించేలా చర్యలుంటాయని మంత్రి ముత్తుస్వామి తెలిపారు.


రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ముందు జనం

హాట్ కేకుల్లా టికెట్లు

- ఐదునిమిషాల్లో ముగిసిన పొంగల్ రిజర్వేషన్లు

అడయార్, సెప్టెంబరు 12: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రధాన రైళ్లలో ముందస్తు రిజర్వేషన్ గురువారం ప్రారంభమైంది. ఈ బుకింగ్ ప్రారంభమైన కొన్ని క్షణాల్లోనే టిక్కెట్లు అమ్ముడుపోయాయి. వచ్చే యేడాది జనవరి 11 న ప్రయాణం చేయదలచిన ప్రయాణికులకు మాత్రం శుక్రవారం బుకింగ్ ఓపెన్ అవుతుంది. తమిళ సంప్రదాయ పండుగల్లో ఒకటైన సంక్రాంతి జనవరి 14 న జరుపుకోనున్నారు. ఇందులో భాగంగా ప్రధాన మార్గాల్లోని నడిచే రైళ్లలో ముందస్తు రిజర్వేషన్ గురువారం నుంచి ప్రారంభమైంది. జనవరి 10వ తేదీన తమ సొంతూర్లకు వెళ్లాలనుకునే వారు గురువారం రిజర్వేషన్ చేసుకున్నారు. ఇందుకోసం ఉదయం 8 గంటలకే రిజర్వేషన్ కౌంటర్లకు భారీ సంఖ్యలో చేరుకున్నారు. అనేక మంది ఐఆర్‌టీసీ వెబ్‌సైట్‌లో రిజర్వేషన్ చేసుకున్నారు. ఈ బుకింగ్ ప్రారంభమైన కేవలం ఐదు నిమిషాల్లోనే ఈ టిక్కెట్లు బుక్ అయ్యాయి. ముఖ్యంగా చెన్నై నుంచి దక్షిణాది జిల్లాలకు వెళ్ళే రైళ్ళతో పాటు, దక్షిణాది జిల్లాల నుంచి చెన్నైతో పాటు ఉత్తరాది జిల్లాలకు వచ్చే రైళ్ళలో టిక్కెట్లు బుక్ అయిపోయాయి.

మహిళల జీవనశైలిని మెరుగుపరచడమే ధ్యేయం!

- కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్


కోయంబత్తూరులో మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న మంత్రి నిర్మలా సీతారామన్

ప్యారీస్, సెప్టెంబరు 12: మహిళల జీవన శైలిని మెరుగుపరిచే దిశగా కేంద్ర ప్రభుత్వ పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. కోయంబత్తూరులో మక్కల్ సేవై మయ్యం స్వయం పథకం కింద 1500 మంది నిరుపేద మహిళలకు గురువారం ఉదయం జరిగిన కార్యక్రమంలో కుట్టుమిషన్లు తదితర సహాయాలను అందజేశారు. ఆ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పురుషులకు దీటుగా మహిళలు కూడా స్వయంశక్తితో ప్రతిభావంతులుగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం విప్లవాత్మకమైన పథకాలను పరిచయం చేస్తోందన్నారు. పీఎం జన్‌ధన్ ఖాతా ద్వారా మహిళలు స్వీయ వృత్తులు చేపట్టి ఆర్థికంగా లబ్ధి పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోయంబత్తూరు బీజేపీ శాసనసభ్యురాలు వానతి శ్రీనివాసన్, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

వామపక్ష నేత సీతారాం ఏచూరికి పలువురి నేతల సంతాపం



ప్యారీస్, సెప్టెంబరు 12 : ప్రముఖ రాజకీయనేత, వామపక్ష యోధుడు. సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పట్ల పలువురు నేతలు సంతాపం తెలిపారు. గురువారం మధ్యాహ్నం వేర్వేరుగా సంతాప సందేశాలు విడుదల చేశారు. గవర్నర్ ఆర్ఎన్ రవి తన ప్రకటనలో సీతారాం ఏచూరి జాతీయ రాజకీయాల్లో చెరగని ముద్రవేశారని కొనియాడారు. ముఖ్యమంత్రి స్టాలిన్ తన ఎక్స్‌పేజీలో సీతారాం ఏచూరి ప్రసంగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన మృతి రాజకీయ రంగానికే తీరని లోటని, సెక్యూలరిజం, మత సామరస్యం కోసం పాటుపడ్డారని కీర్తించారు. కార్మికుల పక్షపాతి సీతారాం ఏచూరి అని ఆయన మృతి దేశానికి, శ్రామికవర్గాలకు తీరని లోటు అని అన్నాడీఎంకే ప్రధానకార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. ఇండియా కూటమికి సీతారాం ఏచూరి వెన్నెముకలా నిలిచి బలం చేకూర్చారని, ఆయన భౌతికంగా లేకపోవడం కూటమికి తీరని లోటని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. మాజీముఖ్యమంత్రి జయలలిత సన్నిహితురాలు వీకే శశికళ, అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం నేత టీటీవీ దినకరన్, పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్, ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో, డీఎండీకే నాయకురాలు ప్రేమలత, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, డీపీఐ నేత తొల్ తిరుమావళవన్, సీపీఎం రాష్ట్ర కమిటీ కార్యదర్శి కే బాలకృష్ణన్, సీపీఐ రాష్ట్ర కమిటీ కార్యదర్శి ముత్తరసన్ సహా పలు కార్మిక సంఘాల నేతలు కూడా సీతారాం ఏచూరి మృతికి సంతాపం ప్రకటించారు.

మూడు రోజులు పార్టీ కార్యక్రమాల రద్దు

- సీపీఎం రాష్ట్ర కమిటీ

పెరంబూర్, సెప్టెంబరు 12: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి సంతాపంగా మూడు రోజులు పార్టీ కార్యక్రమాలు రద్దు చేస్తున్నట్లు ఆ పార్టీ కమిటీ ప్రకటించింది. ఈ మేరకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్ విడుదల చేసిన ప్రకటనలో... ఏచూరి మృతికి సంతాపంగా రాష్ట్రవ్యాప్తంగా పార్టీ జెండాలు వారం రోజులు అవనతం చేయాలని, అన్ని ప్రాంతాల్లో ఏచూరి చిత్రపటాలు ఉంచి నివాళులర్పించే కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.


కోడంబాక్కం జోన్‌లో ఎంజీర్‌నగర్ వద్దనున్న కాలువ గోడ నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న మేయర్ ఆర్.ప్రియ

సమాచార దర్శిని

గ్రూప్-4లో 480 అదనపు పోస్టులు

ఐసిఎఫ్, సెప్టెంబరు 12: తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) గ్రూప్-4 ఫలితాలు అక్టోబరులో విడుదల కానున్న నేపథ్యంలో, అదనంగా 480 పోస్టులు చేర్చారు. వీఏఓ, జూనియర్ అసిస్టెంట్ సహా 6,244 పోస్టుల భర్తీకి గ్రూప్-4 పరీక్ష ఆగస్టు 9వ తేది జరిగింది. ఈ పరీక్షకు 15.88 లక్షల మంది హాజరయ్యారు. ఈ నేపథ్యంలో, 128 జూనియర్ అసిస్టెంట్లు, 70 ఫారెస్ట్ రేంజర్లు, 47 బిల్ కలెక్టర్లు, 194 సహాయ సేల్స్‌మెన్ సహా 480 పోస్టులు అదనంగా చేర్చారు. ఆ ప్రకారం, ఈ పరీక్ష ద్వారా 6,724 పోస్టులు భర్తీకానున్నాయని టీఎన్‌పీఎస్సీ తెలిపింది.

అప్రెంటీస్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, సెప్టెంబరు 12: మెట్రోపాలిటన్ రవాణా సంస్థ (ఎంటీసీ)లో అప్రెంటీస్ పొందేందుకు ఈ నెల 26వ తేది దరఖాస్తు చేసుకోవాలని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ తెలిపారు. ఎంటీసీలో 2024-25వ సంవత్సరానికి ఒక సంవత్సరం అప్రెంటీస్ శిక్షణ పొందేందుకు ఐటీఐ ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. శిక్షణా సమయంలో నెలకు రూ.14,000 ఉపకార వేతనం అందజేస్తారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 26వ తేది ఉదయం 10 గంటలకు క్రోంపేటలో ఉన్న ఎంటీసీ వృత్తి శిక్షణ పాఠశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని మేనేజింగ్ డైరెక్టర్ తెలిపారు.

స్టార్టప్ ఉత్సవాల్లో పాల్గొనేందుకు అవకాశం

ఐసిఎఫ్, సెప్టెంబరు 12: వృత్తి సంస్థలకు మార్కెట్, ఎగుమతి అవకాశాలు, ఆర్థిక సాయాలను రాష్ట్ర ప్రభుత్వ స్టార్టప్ టీఎన్ అందజేస్తోంది. స్టార్టప్ వృత్తులు ప్రారంభించే వారిని ప్రోత్సహించేందుకు మదురైలో ఈ నెల 28,29 తేదీల్లో స్టార్టప్ ఉత్సవాలు నిర్వహిస్తోంది. కొత్త రకం వస్తువులు ఉత్పత్తి చేసే సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శించేందుకు స్టార్టప్ టీఎన్ ఆహ్వానిస్తోంది. ఈ ప్రదర్శనలో పాల్గొనేందుకు రూ.2,500 రుసుము చెల్లించి పేరు నమోదుచేసుకోవాల్సి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఉద్యోగుల రిటైర్మెంట్ గ్రాట్యుటీ పెంపు

పెరంబూర్, సెప్టెంబరు 12: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ గ్యాట్యుటీని రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచుతూ రాష్ట్రప్రభుత్వం జీవో విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వ ప్రకటన అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మరణ, పదవీ విరమణ గ్రాట్యుటీని రూ.25 లక్షలకు పెంచిన ప్రభుత్వం, గ్రాట్యుటీ పెంపు జనవరి 1వ తేది నుంచి అమలుకు వస్తుందని జీవోలో పేర్కొనింది.

1.30 లక్షల కొత్త రేషన్ కార్డులు సిద్ధం

పెరంబూర్, సెప్టెంబరు 12: రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న 3 లక్షల మందిలో 1.30 మందికి కొత్త రేషన్ కార్డులు సిద్ధం చేసినట్లు ఆహార శాఖ మంత్రి చక్రపాణి తెలిపారు. స్థానిక అన్నానగర్‌లో సహకారసంఘంఆధ్వర్యంలోని అముదం స్టోర్‌ను గురువారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొళత్తూర్, కాంచీపురంలలో కూడా త్వరలో అముదం స్టోర్స్ ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు.

ఒప్పంద ఉద్యోగులకు 5వ తేదిలోగా వేతనం

ఐసిఎఫ్, సెప్టెంబరు 11: ఒప్పంద ఉద్యోగులకు ఇకపై ప్రతినెలా 5వ తేదిలోగా వేతనం చెల్లించాలని కార్పొరేషన్ కమిషనర్ కుమరగురుపరన్ ఉత్తర్వులు జారీచేశారు. కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఒప్పంద కార్మికులకు వేతనాలు ఆలస్యంగా ఇస్తున్నారనే ఫిర్యాదులపై కమిషనర్ కుమరగురుపరన్ స్పందించారు. బయోమెట్రిక్ ద్వారా 1వ తేది నుంచి 30 లేదా 31వ తేది వరకు అటెండెన్స్ చూసి వేతనాలు 5వ తేదిలోపు అందజేయాలని ఉత్తర్వులు జారీచేశారు.

పళని హుండీ ఆదాయం రూ.3.32 కోట్లు

ఐసిఎఫ్, సెప్టెంబరు 12: దిండుగల్ జిల్లా పళని సుబ్రమణ్యస్వామి ఆలయంలో బుధవారం భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు ప్రక్రియ జరిగింది. రూ.3,32,50,873 నగదు, మలేసియా, సింగపూర్, శ్రీలంక వంటి దేశాల కరెన్సీ నోట్లు 1,012, బంగారు ఆభరణాలు 1,237 గ్రాములు, 21. 638 కిలోల వెండి ఆభరణాలు భక్తులు కానుకగా సమర్పించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

ఐసిఎఫ్, సెప్టెంబరు 12: స్థానిక టి.నగర్, వ్యాసర్పాడి డివిజన్లలో శుక్రవారం ఉదయం 11 గంటలకు విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది. టి.నగర్ పరిధిలోని వినియోగదారులు నుంగంబాక్కం ఎంజీఆర్ రోడ్డు మెట్రో వాటర్ బోర్డు కార్యాలయం సమీపంలో ఉన్న ఉప విద్యుత్ కేంద్రం ప్రాంగణం, వ్యాసర్పాడి పరిధికి చెందిన వినియోగదారులు రామలింగర్ ఆలయం ఎదుట ఉన్న ఉప విద్యుత్ కేంద్రం ప్రాంగణంలో జరిగే గ్రీవెన్స్‌లో పాల్గొని, తమ సమస్యలకు పరిష్కారం పొందాలని అధికారులు సూచించారు.

తాంబరం-రామనాథపురం మధ్య ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, సెప్టెంబరు 12: ప్రయాణికుల సౌకర్యార్థం తాంబరం-రామనాథపురం-తాంబరం మధ్య ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ● నెం.06103 తాంబరం-రామనాథపురం ప్రత్యేక రైలు ఈ నెల 19,21,23,26,28,30 తేదీల్లో తాంబరంలో సాయంత్రం 5 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 5.55 గంటటకు రామనాథపురం చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06104 రామనాథపురం-తాంబరం ప్రత్యేక రైలు ఈ నెల 20,22,24,27,29, అక్టోబరు 1 తేదీల్లో రామనాథపురంలో ఉదయం 10.55 గంటలకు బయల్దేరి రాత్రి 11.10 గంటలకు తాంబరం చేరుకుంటుంది. ఈ రైళ్ల రిజర్వేషన్ ప్రారంభమైందని దక్షిణ రైల్వే తెలిపింది.

ఖాళీగా ఉన్న 1,423 ఎంబీబీఎస్ సీట్లు

ఐసిఎఫ్, సెప్టెంబరు 12: ప్రభుత్వ, ప్రైవేటు వైద్యకళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల భర్తీకి తొలివిడత కౌన్సెలింగ్ ముగిసిన నేపథ్యంలో, 1,423 ఎంబీబీఎస్, 1,566 బీడీఎస్ సీట్లు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ప్రభుత్వ కోటాకు 397 ఎంబీబీఎస్, 704 బీడీఎస్ సీట్లున్నాయి. 7.5 శాతం రిజర్వేషన్ కోటాలో 23 బీడీఎస్, దివ్యాంగుల విభాగంలో 2 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. మేనేజ్‌మెంట్ కోటాలో 1,024 ఎంబీబీఎస్, 839 బీడీఎస్ సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఈ సీట్లకు రెండవ విడత కౌన్సెలింగ్ https://tnmedicalselection.net/ అనే వెబ్‌సైట్‌లో ప్రారంభమైంది. ప్రభుత్వ కోటాలో దరఖాస్తు చేసుకున్న 28,819 మంది, మేనేజ్‌మెంట్ కోటాలో దరఖాస్తు చేసుకున్న 13,417 మంది కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు శుక్రవారం సాయంత్రం 5 గంటల్లోగా నమోదుచేసుకోవాలి. 14వ తేది మధ్యాహ్నం 12 గంటల నుంచి 16వ తేది సాయంత్రం 5 గంటల వరకు నచ్చిన కళాశాలల్లో సీట్లు ఎంపిక చేసుకోవచ్చు. సీట్ల కేటాయింపు వివరాలు 19వ తేది విడుదల కానున్నాయి. ఈ నెల 26వ తేదిలోపు కళాశాలల్లో చేరాలని వైద్య విద్య డైరెక్టరేట్ తెలిపింది.

బధిర విద్యార్థులకు చేయూత


బధిర విద్యార్థులతో శివకుమారి తదితరులు

అడయార్, సెప్టెంబరు 12: లయన్స్ క్లబ్ 324ఎం డిస్ట్రిక్ట్‌లోని సౌత్ సిటీ అధ్యక్షురాలు డాక్టర్ ఏవీ శివకుమారి తన పుట్టిన రోజును పురస్కరించుకుని నుంగంబాక్కంలోని లిటిల్ ఫ్లవర్ కాన్వెంట్‌కు చెందిన బధిర విద్యార్థులకు వివిధ రకాల సహాయాలను అందజేశారు. ఈ విద్యార్థులకు వస్తువులు కొరత ఉన్నట్టు తెలుసుకున్న ఆమె... దిన చర్యలకు ఉపయోగపడేలా బక్కెట్లు, మగ్స్, సబ్బులు, సబ్బు పెట్టెలు, టవల్స్ తదితర వస్తువులను 50 మంది విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆదాయపన్ను శాఖ కమిషనర్, ఐఆర్‌ఎస్ అధికారి నందకుమార్, లయన్స్ క్లబ్ ఆఫ్ అన్నా నగర్ క్లబ్‌లోని రీజినల్ చైర్‌పర్సన్ లయన్ సురేష్ కుమార్ ప్రత్యేక అతిథిగాను, క్లబ్ ట్రెజరర్ విజయలక్ష్మి రాజేందర్, క్లబ్ సభ్యురాలు రేవతిలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఐఐటీ గేట్ వద్ద విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

బైకులను అనుమతించని సెక్యూరిటీ

అడయార్, సెప్టెంబరు 12: ఐఐటీ మద్రాస్ ప్రవేశ ద్వారం వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు హఠాత్తుగా ఆందోళనకు దిగారు. దీంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఐఐటీ క్యాంపస్‌లో కేంద్రీయ విద్యాలయంతో పాటు వనవాణి హైయ్యర్ సెకండరీ పాఠశాలలున్నాయి. ఈ రెండు స్కూళ్లలో చదువుతున్న తమ పిల్లలను విద్యార్థుల తల్లిదండ్రులు ద్విచక్రవాహనాలపై తీసుకొస్తుంటారు. ఐఐటీకి అడయారు వద్ద ప్రధాన ప్రవేశ ద్వారం ఉండగా, వేళచ్చేరి, తరమణిలో అనుబంధ గేట్లున్నాయి. అయితే, ఐఐటీఎం చైర్మన్‌గా కామకోటి బాధ్యతలు స్వీకరించినప్పటికీ ఐఐటీ-ఎంలో భద్రత కఠినతరం చేశారు. దీంతో ఆయా గేట్ల వద్ద ఉండే సెక్యూరిటీ సిబ్బంది ఐఐటీలోకి వచ్చి వెళ్ళే ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తుంటారు. ఈ నేపథ్యంలో ఈ క్యాంపస్‌లో ఉన్న స్కూళ్లకు వెళ్ళే విద్యార్థుల తల్లిదండ్రుల వాహనాలకు పాస్‌లు కూడా జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఇటీవల వనవాణి స్కూల్‌కు చెందిన ఒక విద్యార్థి కిందపడి గాయపడ్డాడు. దీంతో పాఠశాల యాజమాన్యం ఒక ప్రకటన విడుదల చేసింది. విద్యార్థులను ఆయా గేట్ల వరకు మాత్రమే తీసుకురావాలంటూ నిబంధన పెట్టారు. ఆయా గేట్లలో వదిలిన విద్యార్థులు ఐఐటీఎంకు చెందిన బస్సుల్లో పాఠశాలకు వెళ్తారంటూ పేర్కొన్నారు. దీన్ని విద్యార్థుల తల్లిదండ్రులు వ్యతిరేకిస్తూ ప్రధాన గేట్ వద్ద గురువారం ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న వనవాణి స్కూల్ ప్రిన్సిపాల్ అక్కడకు చేరుకుని విద్యార్థుల తల్లిదండ్రులను శాంతింపజేసేందుకు ప్రయత్నించారు. అయితే విద్యార్థుల తల్లిదండ్రులు మాత్రం తమ పిల్లలను వాహనాల్లో తామే స్కూలుకు తీసుకొచ్చి, తీసుకెళ్ళేలా అనుమతివ్వాల్సిందేనంటూ పట్టుబట్టారు. తమ సమస్య పరిష్కారమయ్యేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని వారు ప్రకటించారు.

లంక నావికాదళం దాడులకు నిరసనగా నాగపట్టినంలో జాలర్ల సమ్మె



చెన్నై, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక నావికాదళం మూడు రోజుల క్రితం సముద్రంలో చేపలు పడుతున్న నలుగురు జాలర్లపై దాడి చేసిన సంఘటనను ఖండిస్తూ నాగపట్టినం జాలర్లు గురువారం సమ్మెలో పాల్గొన్నారు. నాగపట్టినం జిల్లా వేలాంగన్ని సమీపం సెరుదూరు గ్రామంలో సుమారు 3వేల మందికి పైగా జాలర్లు ఈ సమ్మెలో పాల్గొన్నారు. తమిళజాలర్లపై శ్రీలంక నావికాదళం దాడులు జరుపకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జాలర్ల సంఘం నాయకులు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

రూ.20 కోట్లతో కిలంబాక్కం రైల్వేస్టేషన్

● జనవరిలో ప్రారంభం

ప్యారీస్, సెప్టెంబరు 12: చెంగల్పట్టు జిల్లా కిలంబాక్కం ప్రాంతంలో రూ.20 కోట్లతో చేపట్టిన రైల్వేస్టేషన్ జనవరి నాటికి ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చే అవకాశముందని అధికారులు తెలిపారు. ఇటీవల కిలంబాక్కంలో రాష్ట్రప్రభుత్వం కొత్తగా నిర్మించిన బస్ టెర్మినల్ నుంచి తిరుచ్చి, మదురై, తిరునల్వేలి, కన్నియాకుమారి తదితర దక్షిణ జిల్లాలకు ప్రభుత్వ రవాణా సంస్థలు బస్సులు నడుపుతున్నాయి. వండలూరు-ఊరపాక్కం మధ్య కిలంబాక్కం బస్ టెర్మినల్ ఉండడంతో ఆ మార్గంలో వాహనాల రద్దీ రోజురోజుకు అధికమవుతూ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందువల్ల కిలంబాక్కంలో కొత్తగా రైల్వేస్టేషన్ నిర్మించేందుకు రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. చెన్నై మెట్రోరైల్ సంస్థ ద్వారా దక్షిణ రైల్వే నుంచి పొందిన అనుమతులతో ముమ్మరంగా జరుగుతున్న కొత్త రైల్వేస్టేషన్ పనులు దాదాపు 90 శాతానికి పైగా పూర్తయినట్లు అధికారులు తెలిపారు. కిలంబాక్కం బస్ టెర్మినల్, రైల్వేస్టేషన్లను కలుపుతూ రూ.79 కోట్లతో సీఎండీఏ నిధులతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి కూడా నిర్మిస్తున్నట్లు అధికారులు వివరించారు.

పల్లిపట్టు సమీపంలో ఈడీ అధికారుల తనిఖీ


కుమారరాజపేటలో తనిఖీలు నిర్వహిస్తున్న ఈడీ అధికారులు

ప్యారీస్, సెప్టెంబరు 12: తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి నియోజకవర్గ పరిధిలోని పల్లిపట్టు సమీపంలోని కుమారరాజపేటలో ఐదుగురు యువకుల ఇళ్లలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం (ఈడీ) అధికారులు గురువారం ఉదయం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఢిల్లీ నుంచి వచ్చిన అధికారుల బృందం సీఆర్‌పీఎఫ్ భద్రత మధ్య సుమారు 5 గంటల పాటు తనిఖీ చేశారు. కుమారరాజపేటకు చెందిన ప్రకాష్, అరవిందన్, తమిళరసన్ సహా ఐదుగురి బ్యాంక్ ఖాతాల్లో రూ.2 కోట్లమేర బట్వాడా జరిగిన దానిపై వారిని విచారించారు. ఈ ఐదుగురి ద్విచక్ర వాహనాలు, వారి బంధువుల వివరాలను ఈడీ అధికారులు సేకరించారు. దేశంలో నిషేధించిన ఉగ్రవాద సంస్థలతో వీరికి ఏవైనా సంబంధాలున్నాయా అన్న కోణంలో విచారణ జరిపినట్లు అధికారులు తెలిపారు.

సౌత్ జోన్ ఉమెన్స్ ప్రీమియర్ లీగ్


మైదానంలో తలపడుతున్న క్రీడాకారిణులు

అడయార్, సెప్టెంబరు 12: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాతో కలిసి తమిళనాడు జూడో అసోసియేషన్, వీర్ వివేకా నమో అకాడెమీ ఆధ్వర్యంలో నాలుగో ఎడిషన్ ఖేలో ఇండియా ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ సౌత్ పోటీలు నగరంలో ప్రారంభమయ్యాయి. ఈ పోటీల నిర్వహణకు జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కూడా తన వంతు సహకారం అందిస్తోంది. ఇందులో ఆరు సౌత్ జోన్ రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, ఏపీ, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాలకు చెందిన 1500 మంది క్రీడాకారిణిలు పాల్గొంటున్నారు. మొత్తం నాలుగు కేటగిరీల్లో నిర్వహించే ఈ పోటీల తుదిపోరు కేరళ రాష్ట్రంలో జరుగనుంది. ఈ విషయాన్ని తమిళనాడు జుడో అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్.విజయ్ వెల్లడించారు. ఈ టోర్నీని ఇండియన్ నేషనల్ ఆర్మీ ఫౌండర్ నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు అంకితం చేయనున్నట్టు వెల్లడించారు 12 నుంచి 15 యేళ్ళ వయస్సున్న వారికి సబ్ జూనియర్, 16 నుంచి 17 యేళ్ళ వయస్సున వారిని కేడెట్ వెయిట్ బేసిక్, 17 నుంచి 20 యేళ్ళ వయసు వారిని జూన్ బేసిక్ వెయిట్ డివిజన్, 21 యేళ్ళ పైబడిన వారికి సీనియర్ వెయిట్ బేసిక్ డివిజన్‌లో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఓటర్లకు నగదు బట్వాడా కేసు...

విచారణకు ఎంపీ హాజరు


విచారణకు హాజరవుతున్న ఎంపీ కదిర్ ఆనంద్

వేలూరు, సెప్టెంబరు 12: పార్లమెంటు ఎన్నికల్లో ఓటర్లకు నగదు బట్వాడా చేశారంటూ నమోదైన కేసు విచారణ కోసం వేలూరు కోర్టులో డీఎంకే ఎంపీ కదిర్ ఆనంద్ హాజరయ్యారు. 2019 పార్లమెంటు ఎన్నికల్లో వేలూరు పార్లమెంటు నియోజకవర్గ డీఎంకే అభ్యర్థిగా దురైమురుగన్ కుమారుడు కదిర్ ఆనంద్ పోటీచేశారు. ఆ సమయంలో దురైమురుగన్ ఇంట్లో ఐటీ అధికారులు చేపట్టిన తనఖీల్లో లెక్కల్లో లేని రూ.10 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. కదిర్ ఆనంద్‌కు సన్నిహితుడైన దామోదరన్‌కు చెందిన సిమెంటు గోదాములో రూ.10.48 కోట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంపై అప్పటి ఎన్నికల అధికారి సిలుప్పన్ ఫిర్యాదు మేరకు కాట్పాడి పోలీసులు, డీఎంకే అభ్యర్థి కదిర్ ఆనంద్, పార్టీ నేతలు పూంజోలై శ్రీనివాసన్, ఆయన బంధువు దామోదరన్ తదితరులపై కేసు నమోదుచేశారు. ఈ కేసు వేలూరు జేఎం-1 కోర్టులో విచారణ జరుగుతున్న నేపథ్యంలో, గురువారం జరిగిన విచారణకు ఎంపీ కదిర్ ఆనంద్ హాజరయ్యారు. ఈ కేసు తదుపరి విచారణ అక్టోబరు 24వ తేదీకి వాయిదావేస్తూ మేజిస్ట్రేట్ సత్యకుమార్ ఉత్తర్వులు జారీచేశారు.

ముస్లిం రిజర్వేషన్ కోటా 7 శాతానికి పెంచాలి

● ఎస్‌డీపీఐ డిమాండ్

అడయార్, సెప్టెంబరు 12: ముస్లింలకు ఇస్తున్న రిజర్వేషన్లను ఏడు శాతానికి పెంచాలని కోరుతూ ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో నవంబరు 16న భారీ ధర్నా చేయనున్నట్టు ఎస్‌డీపీఐ రాష్ట్ర అధ్యక్షుడు నెల్లై ముబారక్ గురువారం వెల్లడించారు. ఎస్‌డీపీఐ రాష్ట్ర కార్యవర్గ, జిల్లా కార్యవర్గాల సమావేశం నగరంలో జరిగింది. ఈ సమావేశం అనంతరం ముబారక్ మీడియాతో మాట్లాడుతూ, వక్ఫ్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని కోరారు. దేశంలో మైనార్టీలకు రక్షణ కల్పించేలా భద్రతా చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ తరహా చట్టాన్ని తమిళనాడు ప్రభుత్వం ముందుగా ఆమోదించి, ఇతర రాష్ట్రాలకు ఆదర్శప్రాయంగా నిలవాలని ఆయన కోరారు. దీంతో పాటు తమ ప్రధాన డిమాండ్ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నవంబరు 16న చెన్నై నగరంలో భారీ ధర్నా చేయనున్నట్టు తెలిపారు.

విరుదునగర్‌లో రూ.10 కోట్ల భూమి స్వాధీనం

అడయార్, సెప్టెంబరు 12: విరుదునగర్ జిల్లా మావూత్తు ఉదయగిరి నాథర్ ఆలయానికి చెందిన రూ.10 కోట్ల విలువైన 388 ఎకరాలను హిందూ దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ భూములను ఆలయ పేరుమీదే పట్టా తీసుకుని పరిరక్షించేందుకు ఆలయ అధికారులు ప్రయత్నాలు మొదలుపెట్టారు.ఈభూములు కొందరి ఆధీనంలో ఎన్నో ఏళ్ళుగా ఉన్నట్టు ఇటీవలే వెలుగులోకి వచ్చింది. ఇదే విషయంపై కాశిగిరి కోసాకియార్ వారసురాలు, ఆలయ ట్రస్టీ రూప వద్ద అధికారులు విచారణ జరిపారు. ఆ తర్వాత ఈ భూములను ఆలయ పేరుమీద మార్చేందుకు వారసురాలు రూప కూడా అంగీకరించారు. దీంతో స్వాధీనం చేసుకున్న 388 ఎకరాల భూములను ఆలయ పేరుమీద మార్చేందుకు దేవాదాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

కేంద్రీయ విద్యాలయాల్లో వసతులు మెరుగుపరచాలి

● టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై


అరివళగన్‌ను పార్టీ శ్రేణులతో కలిసి సత్కరిస్తున్న సెల్వపెరుందగై

ప్యారీస్, సెప్టెంబరు 12: కేంద్రీయ విద్యాలయాల్లో వసతులు మెరుగుపరచాలని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగై కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాయపేటలోని టీఎన్‌సీసీ ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవన్‌లోఇటీవల ఆలిండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) జాతీయ కార్యదర్శిగా, కేరళ కాంగ్రెస్ పరిశీలకుడిగా నియమితులైన అరివళగన్‌ను పార్టీ శ్రేణులతో కలిసి గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సెల్వపెరుందగై మాట్లాడుతూ... పీఎం స్కూల్స్ ఆఫ్ రైజింగ్ ఇండియా పాఠశాలల పథకం కింద దేశవ్యాప్తంగా 14,500 పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, పేద విద్యార్థులకు వ్యతిరేకంగా ప్రకటించిన ఈ పథకాన్ని అమలు చేసేందుకు చర్యలు చేపట్టిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మోడల్ పాఠశాలలను అభివృద్ధి చేయడానికి బదులుగా ఇప్పటికే పనిచేస్తున్న కేంద్రీయ విద్యాలయాల్లో విద్యార్థులకు, టీచర్లకు కనీసవసతులు మెరుగుపరచాలని, లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన హెచ్చరించారు.

నిత్యపెళ్ళి కూతురికి బెయిల్ మంజూరు


సంధ్య

చెన్నై, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెళ్ళిపేరుతో సుమారు యాభైమందిని మోసగించిన కేసులో అరెస్టయిన ఈరోడ్ జిల్లాకు చెందిన యువతి సంధ్యకు మద్రాసు హైకోర్టు బెయిలు మంజూరు చేసింది. తిరుప్పూరు జిల్లా తారాపురానికి చెందిన మహేష్ అరవింద్ అనే యువకుడు ఆన్‌లైన్‌లో వధువు కోసం అన్వేషిస్తుండగా సంధ్యతో పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత వారు వివాహం చేసుకున్నారు. సంధ్యకు వివాహ సమయంలో మహేష్ అరవింద్ కుటుంబీకులు 12 సవర్ల నగలు కానుకగా ఇచ్చారు. కొద్ది రోజులపాటు సవ్యంగా సాగిన వీరి కాపురం ఉన్నట్టుండి మలుపు తిరిగింది. సంధ్య ఫోన్‌లో పలువురు యువకులతో అశ్లీలంగా తీసుకున్న ఫొటోలు కనిపించడంతో మహేష్ దిగ్భ్రాంతిచెందాడు. ఆ విషయమై ఇద్దరూ గొడవపడ్డారు. ఆ నేపథ్యంలో ఉన్నట్టుండి సంధ్య ఇంటి నుండి పారిపోవటంతో మహేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుప్పూరు. పోలీసుల విచారణలో సంధ్య పారిశ్రామికవేత్తలు, ఇంజనీర్లు సహా సుమారు 50 మందిని పెళ్ళి చేసుకుని నగలు, నగదు దోచుకుని మోసగించినట్లు వెల్లడైంది. సంధ్యను అరెస్టు చేసి జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో ఆమె బెయిలు కోరుతూ హైకోర్టులో పిటిషన్ వేసింది. అందులో తనను అరెస్టు చేసి రెండు నెలలు గడిచినా పోలీసులు ఇంకా ఛార్జిషీట్ దాఖలు చేయలేని, ఈ కారణంగా తనకు బెయిలివ్వాలని కోరింది. ఆ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి పి. ధనపాల్ ఆమెకు బెయిలు మంజూరు చేశారు.

రేపటి నుంచి సబర్బన్ రైళ్ల వేళల్లో మార్పులు

పెరంబూర్, సెప్టెంబరు 12: స్థానిక బీచ్ రైల్వేస్టేషన్ సమీపంలో మరమ్మతుల కారణంగా శుక్రవారం నుంచి ఈ నెల 16వ తేది వరకు రాత్రి వేళ సబర్బన్ రైళ్లలో మార్పులు జరిగాయని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

పూర్తిగా రద్దయిన రైళ్లు..

- చెన్నై బీచ్ నుంచి రాత్రి 8.25, 8.55, 10.20 తాంబరం బయల్దేరే సబర్బన్ రైళ్లు.
- చెన్నై బీచ్ నుంచి రాత్రి 7.50కు తిరువళ్లూర్, తిరువళ్లూర్ నుంచి రాత్రి 9.35 గంటలకు చెన్నై బీచ్‌కు బయల్దేరే సబర్బన్ రైళ్లు.
- చెన్నై బీచ్ నుంచి రాత్రి 10.45 గంటలకు గుమ్మిడిపూండి, గుమ్మిడిపూండి నుంచి రాత్రి 9.55 గంటలకు చెన్నై బీచ్‌కు బయల్దేరే రైళ్లు .
- చెన్నై బీచ్ నుంచి తెల్లవారుజామున 4.05 గంటలకు అరక్కోణం బయల్దేరే సబర్బన్ రైలు ఈ నెల 14 నుంచి 17వ తేది వరకు పూర్తిగా రద్దు.

పాక్షిక రద్దు (ఈ నెల 13 నుంచి 16వ తేది వరకు)...

- చెన్నై బీచ్ నుంచి రాత్రి 11.05, 11.30, 11.59 గంటలకు తాంబరం బయల్దేరే సబర్బన్ రైళ్లు చెన్నై బీచ్‌కు బదులుగా ఎగ్మూర్ నుంచి బయల్దేరుతాయి.
- చెన్నై బీచ్ నుంచి వేకువజామున 3.50 గంటల చెంగల్పట్టు, చెంగల్పట్టు నుంచి రాత్రి 9.10 గంటలకు చెన్నై బీచ్‌కు బయల్దేరే సబర్బన్ రైళ్లు చెన్నై బీచ్‌కు బదులుగా ఎగ్మూర్ వరకు మాత్రమే నడవనున్నాయి.
- చెంగల్పట్టు నుంచి రాత్రి 10.10, 11 గంటలకు చెన్నై బీచ్‌కు బయల్దేరే రైళ్లు ఎగ్మూర్ వరకు మాత్రమే నడువనున్నాయి.
- గుడువాంజేరి నుంచి రాత్రి 10.10, 10.40, 11.15 గంటలకు చెన్నై బీచ్‌కు బయల్దేరే సబర్బన్ రైళ్లు ఎగ్మూర్ వరకు మాత్రమే నడువనున్నాయి.

పురావస్తు తవ్వకాల్లో బయల్పడ్డ మట్టికుండ


కీళడి వద్ద లభ్యమైన మట్టికుండ - విజయ కరిసల్‌కుళం వద్ద బయల్పడిన మట్టి పాత్ర

చెన్నై, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మదురై సమీపం కీళడి వద్ద జరుగుతున్న పదో విడత పురావస్తు తవ్వకాల్లో గురువారం ఉదయం ప్రాచీన కాలం నాటి అందమైన మట్టి కుండ బయల్పడింది. ఆ మట్టిపాత్ర సుమారు 2.25 అడుగుల ఎత్తు, 1.5 అడుగల వెడల్పు ఉంది. పురావస్తు విభాగం డైరెక్టర్ రమేష్, డిప్యూటీ డైరెక్టర్ అజయ్ నేతృత్వంలో సిబ్బంది ఎనిమిది చోట్ల తవ్వకాలు చేపట్టారు. ఆ తవ్వకాల్లో ఈ మట్టికుండ బయల్పడిందని అధికారులు తెలిపారు. ఇదే విధంగా విరుదునగర్ జిల్లా వెంబకోట సమీపం విజయకరిసల్‌కుళం వద్ద జరిగిన మూడో విడత పురావస్తు తవ్వకాల్ల అర్ధచంద్రాకారంలో ప్రాచీన కాలంనాటి మట్టి వంటపాత్ర బయల్పడింది. ఆ పాత్ర ప్రాచీన కాలంలో తమిళులు వంటకు ఉపయోగించి ఉంటారని పురావస్తు విభాగం డైరెక్టర్ పొన్ భాస్కర్ తెలిపారు.

పార్ట్ టైం టీచర్ల నిరాహారదీక్ష


నిరాహారదీక్షలో పార్ట్ టైం టీచర్లు

ప్యారీస్, సెప్టెంబరు 12: రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో పదమూడేళ్లకు పైగా పనిచేస్తున్న పార్ట్ టైం టీచర్లు తమను పర్మినెంట్ చేయాలని కోరుతూ గురువారం ఎగ్మూర్ రాజారత్నం స్టేడి యం సమీపంలో నిరాహారదీక్ష చేశారు. తమిళనాడు పార్ట్ టైం టీచర్ల సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరాహారదీక్షలో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు వి.మురుగదాస్, బాబు, మురళి గౌతమన్ సహా 1,000 మందికి పైగా పాల్గొన్నారు. డీఎంకే అసెంబ్లీ ఎన్నికల హామీల్లో ఒకటైన 181 ప్రకారం పార్ట్ టైం టీచర్లను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా, ఆర్కిటెక్, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర పాఠ్యాంశాల్లో రూ.12,500 వేతనంతో గత పదమూడేళ్లుగా పనిచేస్తున్న టీచర్లకు ప్రభుత్వం న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

500 మద్యం దుకాణాల్లో సీసీ కెమెరాలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 12: రాష్ట్రవ్యాప్తంగా 500 మద్యం దుకాణాల్లో త్వరలో 1,000 సీసీ కెమెరాలు ఏర్పాటుచేయనున్నట్లు టాస్మాక్ అధికారులు తెలిపారు. ఈ సంస్థ 4,829 దుకాణాల ద్వారా మద్యం విక్రయిస్తోంది. ఉద్యోగులు నగదును రాత్రిపూట దుకాణాల్లో ఉంచి మరుసటిరోజు ఉదయం బ్యాంకులో జమచేస్తున్నారు. సంఘ విద్రోహులు మద్యం సీసాలు, నగదు అపహరిస్తున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. వీటిని అరికట్టేందుకు దుకాణాల్లో సీసీ కెమెరాలు అమర్చుతున్నారు. ఇప్పటివరకు 3,000 దుకాణాల్లో వీటిని ఏర్పాటుచేయగా, ప్రస్తుతం ఒక దుకాణానికి రెండు చొప్పున 500 దుకాణాల్లో త్వరలో ఏర్పాటుచేయనున్నట్లు అధికారులు తెలిపారు.

లింక్ క్లిక్ చేసి రూ.1.98 లక్షలు పోగొట్టుకున్న యువకుడు

పెరంబూర్, సెప్టెంబరు 12: స్థానిక చూలైమేడుకు చెందిన విశ్వకుమార్ సెల్‌ఫోన్‌కు ఓ లింక్ వచ్చింది. అతను ఆ లింక్ క్లిక్ చేసిన వెంటనే అతడి బ్యాంక్ ఖాతా నుంచి రూ.1.98 లక్షలు డ్రా చేసినట్లు మెసేజ్ రావడంతో ఖంగుతిన్నాడు. అలాగే, ఐస్ హౌస్ ప్రాంతానికి చెందిన శివగణేష్ క్రెడిట్ కార్డు నుంచి రూ.15 వేలు చోరీకి గురైంది. బాధితుల ఫిర్యాదులతో సైబర్ క్రైం పోలీసులు విచారణ చేపట్టారు.

క్రోంపేట ఎంఐటీ కళాశాలకు బాంబు బెదిరింపు

పెరంబూర్, సెప్టెంబరు 12: స్థానిక క్రోంపేటలో ఉన్న ఎంఐటీ కళాశాలకు గురువారం ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు వచ్చింది. కళాశాలలో బాంబు ఉందని, విద్యార్థులను వెంటనే బయటకు పంపించాలని వచ్చిన ఈ-మెయిల్ చూసిన కళాశాల నిర్వాహకులు చిట్లపాక్కం పోలీసులకు సమాచారం అందించారు. డాగ్‌స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ నిపుణులతో అక్కడకు చేరుకున్న పోలీసులు కళాశాల, ప్రాంగణాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి ఈ-మెయిల్ మెసేజ్ ఫేక్‌గా తేల్చారు.

మహావిష్ణు కార్యాలయాల్లో పోలీసుల తనిఖీ

ప్యారీస్, సెప్టెంబరు 12: దివ్యాంగులను కించపరిచేలా మాట్లాడిన ఆధ్యాత్మిక ప్రవచనకర్త మహావిష్ణు ఇల్లు, కార్యాలయాల్లో పోలీసులు గురువారం తనిఖీలు నిర్వహించారు. ఇటీవల సైదాపేటలోని ప్రభుత్వ పాఠశాలలో మహావిష్ణు చేసిన ప్రసంగం వివాదాస్పదమైంది. సైదాపేట పోలీసులు ఆయనపై ఐదు సెక్షన్ల కింద కేసు నమోదుచేసి ఈ నెల 7న అరెస్ట్ చేశారు. విచారణ నిమిత్తం ఆయనను మూడు రోజులు పోలీసు కస్టడీకి అనుమతిస్తూ సైదాపేట కోర్టు న్యాయమూర్తి సుబ్రమణ్యం బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ నేపథ్యంలో, తిరుప్పూర్‌లో ఉన్న పరమ్‌పొరుల్ ట్రస్ట్ కార్యాలయం, ఇళ్లలో తనిఖీలు నిర్వహించిన పోలీసులు, మహావిష్ణు వద్ద మరికొన్ని వివరాలు సేకరించారు.

సాయం పేరిట వృద్ధుడి నగదు స్వాహా

పెరంబూర్, సెప్టెంబరు 12: స్థానిక కొడుంగైయూర్‌లో వృద్ధుడి నుంచి రూ.84,000 కాజేసిన అగంతకుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఆ ప్రాంతంలోని ఏటీఎం కేంద్రానికి వెళ్లిన వృద్ధుడు డబ్బులు తీసుకొనేందుకు ఇబ్బంది పడుతుండడం గమనించిన ఓ యువకుడు తాను సాయం చేస్తానంటూ ముందుకొచ్చాడు. వృద్ధుడి ఏటీఎం కార్డు పిన్ నెంబరు తెలుసుకున్న అగంతకుడు, డబ్బులు లేవని చెప్పి, మరో కార్డు అందజేశాడు. కొద్దిసేపటికి తన ఖాతా నుంచి రూ.84 వేలు డ్రా చేసినట్లు సెల్‌ఫోన్‌కు వచ్చిన మెసేజ్ చూసిన వృద్ధుడు దిగ్భ్రాంతి చెంది పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ వ్యవహారంపై పోలీసులు కేసు నమోదుచేసి అగంతకుడి కోసం గాలిస్తున్నారు.

వేళచ్చేరిలో 230 కేజీల గుట్కా స్వాధీనం

● ఒకరి అరెస్టు

చెన్నై, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేళచ్చేరి పెరియార్‌నగర్‌లో ఓ ఇంటిలో దాచిన 230 కేజీల గుట్కా బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన అలీజిన్నా (38) అనే యువకుడిని అరెస్టు చేశారు. వేళచ్చేరిలోని ప్రైవేటు పాఠశాల కూడలి వద్ద సీఐ విమల్ నాయకత్వంలో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా మోటారు సైకిలుపై ఓ పెద్ద సంచి పెట్టుకుని వెళుతున్న అలీజిన్నాను అడ్డుకున్నారు. ఆ సంచిలో చూడగా నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తులు బయటపడ్డాయి. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారణ జరిపారు. ఆ తర్వాత పెరియార్‌నగర్‌లో ఉన్న అతడి ఇంటిలో తనిఖీ చేయగా బస్తాల్లో దాచిన 230 కేజీల గుట్కా, పొగాకు ఉత్పత్తులు లభించాయి. పోలీసులు కేసు నమోదు చేసి అలీ జిన్నాను అరెస్టు చేశారు.

వెన్ను నొప్పి పోగొట్టేందుకు ఎన్నో చిట్కాలు

● సీనియర్ ఫిజియోథెరపిస్ట్ రాజు పరాశర్


డాక్టర్ రాజు పరాశర్‌ను సత్కరిస్తున్న ప్రొ ఛాన్సలర్ డాక్టర్ మహేష్ వాకమూడి

చెన్నై, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వెన్ను నొప్పి నయం చేయడానికి ఎన్నో చిట్కాలున్నాయని, నొప్పి 48 గంటలపాటు కొనసాగితేనే వైద్యసహాయం అవసరమవుతుందని ఢిల్లీలోని వెంకటేశ్వరా హాస్పిటల్ సీనియర్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ రాజు పరాశర్ అన్నారు. పోరూరులోని శ్రీరామచంద్ర వైద్య విశ్వవిద్యాలయంలో ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా గురువారం ఉదయం కమలం రామసామి ఉడయార్ స్మారక ధార్మికోపన్యాసం చేస్తూ వెన్ను నొప్పి తగ్గటానికి స్వీయ మందులు వాడకూడదని, నొప్పి వచ్చిందని ఒకే చోట కూర్చోకూడదని చెప్పారు. అదే సమయంలో పూర్తి విశ్రాంతి హానికరమని, ఎక్కువ కాలం హీట్ థెరపీ చేయకూడదని, అరగంటసేపు కాస్త వేగంగా నడవటం, ప్రతి 20 నిమిషాలకు కూర్చునే భంగిమ మార్చుతూ ఉండటం వెన్నునొప్పి త్వరితగతిన నయం కావటానికి మేలైన చిట్కాలని ఆయన తెలిపారు. ప్రొ ఛాన్సలర్ డాక్టర్ మహేష్ వాకమూడి, శ్రీరామచంద్రా ఫిజియోథెరపీ విభాగం ప్రిన్సిపాల్ డాక్టర్ పి. ఆంటోని లీయో అసీర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దేవర సినిమాచూసి చచ్చిపోతా

అమ్మా.. అప్పటిదాకా బతికించండి

తిరుపతిలో బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతున్న యువకుడి వేడుకోలు

● బతికించండంటూ తల్లిదండ్రుల కన్నీరుమున్నీరు

తిరుపతి(విద్య), సెప్టెంబర్ 12 : "నా బిడ్డకి బ్లడ్ కేన్సర్. జూనియర్ ఎన్టీయార్‌కి వీరాభిమాని. రోజు రోజుకీ పరిస్థితి విషమిస్తోంది. 'అమ్మా దేవర సినిమా చూసి చచ్చిపోతా.. 27వ తేదీ దాకా నన్ను బతికించండి..' అని వేడుకుంటున్నాడు" అంటూ 19 ఏళ్ల కౌశిక్ తల్లి సరస్వతి కన్నీరు మున్నీరవుతూ వెల్లడించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం తమ బిడ్డ పరిస్థితి గురించి మీడియాకు వివరిస్తూ సాయం చేయండంటూ ఆమె వేడుకున్నారు. టీటీడీలో కాంట్రాక్ట్ డ్రైవర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులు, సరస్వతి దంపతుల పెద్ద కుమారుడు కౌశిక్ ఇంటర్ చదువుతుండగా అనారోగ్యానికి గురయ్యాడు. బ్లడ్ కేన్సర్ అని నిర్ధారణ కావడంతో 2022 నుంచీ చికిత్స తీసుకుంటున్నాడు.బోన్‌మారో చేయాలని వైద్యులు చెప్పారు. హైదరాబాద్‌లోని బసవతారకం కాన్సర్ ఆసుపత్రి సహా చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్‌ల్లోని ఆసుపత్రులకు తిరిగారు. ప్రస్తుతం బెంగళూరులోని కిడ్‌వై హాస్పిటల్లో కౌశిక్ చికిత్స పొందుతున్నాడు. బోన్ మారో చికిత్సకు దాదాపు రూ.60 లక్షలకు పైగానే ఖర్చవుతుందని తెలియడంతో తల్లిదండ్రులు హతాశులయ్యారు. రోజు రోజుకూ మరణానికి దగ్గరవుతున్న కొడుకును చూస్తూ వారు దుఃఖిస్తున్నారు. దాతలు ముందుకు వస్తే బిడ్డ బతుకుతాడని ఆశ పడుతున్నారు. వారి వేదన చూసి 'అమ్మా నేను బతకనని నాకు తెలుసు.. నా కోసం బాధపడకండి.. దేవర సినిమా దాకా బతికించండి చాలు.. నా చివరి కోరిక తీర్చండి' అంటూ తమను బిడ్డ సముదాయిస్తున్నాడని చెబుతూ, కౌశిక్‌కి ప్రాణదానం చేయండంటూ ఆ తల్లిదండ్రులు చేతులు జోడిస్తున్నారు. 9490829381 నెంబరుకు ఫోన్ పే, గూగుల్‌పే ద్వారా గానీ లేదా కె. సరస్వతి, యూనియన్ బ్యాంక్ అకౌంట్ నెంబరు 103310100044506, ఐఎఫ్ఎస్సీ కోడ్ యూబీఐఎన్0801313కు గాని దాతలు తమ సాయాన్ని అందించవచ్చు.సమాచారం కోసం 79956 65169 నెంబరులో కౌశిక్ తల్లిదండ్రులను సంప్రదించవచ్చు.


ఆసుపత్రిలో కౌశిక్

ముక్తి క్షేత్రం... పున్నైనల్లూరు

● సాలగ్రామ శిలతో స్వామివారు ● కోరిన వరాలిచ్చే కోదండరాముడు ● షోడశ హస్తాలతో దర్శనమిచ్చే సుదర్శనమూర్తి



తమిళుల ధాన్యాగారంగా పేరొంది, రాజరాజచోళుడి కీర్తిని ఎలుగెత్తి చాటేలా నిర్మితమైన బృహదీశ్వరాలయం ఉన్న సుప్రసిద్ధ తంజావూరు నగరానికి కూతవేటు దూరంలో ఉంది పున్నైనల్లూరు క్షేత్రం. ఇక్కడ కోదండరామస్వామి ఆలయం నేపాల్‌లోని ముక్తినాథ్ క్షేత్రంలా భక్తులకు ముక్తిని ప్రసాదించే ఆలయంగా విరాజిల్లుతోంది. ఆలయంలోని సాలగ్రామ కోదండరాముడిని కోరిన కోర్కెలు తీర్చే కరుణామూర్తిగా భక్తులు కొనియాడుతున్నారు. ఈ ప్రాచీన ఆలయంలో సాలగ్రామ శిలతో రూపొందించిన కోదండరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు, సుగ్రీవుడు భక్తులను అనుగ్రహిస్తున్నారు. తంజావూరు సమీపం పున్నైనల్లూరు మారియమ్మన్ ఆలయం సమీపంలో ఈ కోదండరాముడి ఆలయం ఉంది. తంజావూరును పరిపాలించిన మరాఠా చక్రవర్తి ప్రతాప సింహ మహారాజు పాలనలో (క్రీ.శ. 1739 -1763) ఈ ఆలయాన్ని నిర్మించారు.

- చెన్నై, ఆంధ్రజ్యోతి


అంతర ప్రాకారం

ముక్తి క్షేత్రం..

నేపాల్‌లోని ముక్తినాథ్ సుప్రసిద్ధ ముక్తిక్షేత్రంగా పేరొందింది. ఆ క్షేత్రం నుంచి వచ్చిన పెద్ద సాలగ్రామంతో తయారు చేసిన విగ్రహాలు ఇక్కడి ఆలయంలో కొలువుదీరి ఉండటంతో పున్నైనల్లూరు ముక్తి క్షేత్రమేనని అటు వైష్ణవులు, ఇటు శైవులు భావిస్తున్నారు. ఈ ఆలయంలోని శ్రీరాముడిని తులసిమాల సమర్పించి ఆరాధిస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని, పితృదోషం నివృత్తి అవుతుందని, సంతానం కలుగుతుందని, నవగ్రహ దోషాలు తొలగిపోతాయని చెబుతున్నారు.

ఆలయ వైభవం...

ఆలయ రాజగోపురం ప్రాచీన శిల్పకళను చాటేలా ఐదంతస్థులతో, తూర్పుదిశగా కనిపిస్తుంది. రాజగోపురం గుండా లోపలకు ప్రవేశించగానే మహామండపం, అందులో ఎత్తయిన రాగి రేకులు పొదిగిన ధ్వజస్తంభం కనిపిస్తుంది. మహామండప కుడ్యాలపై గరుడాళ్వార్, ఆంజనేయుడు, శ్రీరామపట్టాభిషేక దృశ్యాలు తంజావూరు బాణీ చిత్రాలు అందంగా దర్శనమిస్తాయి. ధ్వజస్తంభం ముందు గరుడాళ్వార్ ప్రత్యేక సన్నిధిలో కొలువుదీరి ఉన్నారు. గర్భాలయం ముందున్న మండప ప్రవేశద్వారానికి ఇరువైపులా ద్వారపాలకులున్నారు. ఈ ఆలయ మూలవిరాట్టుగా ఉన్న సాలగ్రామ విగ్రహాల మాదిరిగానే శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడి ఉత్సవమూర్తులు కూడా ఉన్నాయి. 96 రకాల విమానాల ప్రత్యేకాంశాలతో కూడిన 'సౌందర్య విమానం' దిగువన మూలవిరాట్టు సాలగ్రామ శ్రీరామచంద్రమూర్తి కొలువై ఉన్నారు.

స్థలపురాణం.. : పూర్వం వివాహవేడుకల్లో మహావిష్ణువు అంశంగా భావించే సాలగ్రామ శిలలను సారె వస్తువులుగా ఇవ్వటం ఆనవాయితీగా ఉండేది. సాలగ్రామం అనేది నేపాల్‌లోని గండకీ నదిలో ఏర్పడే దైవీకమైన శిలలు. నేపాల్ రాజు, తంజావూరు పరిపాలించిన మరాఠా చక్రవర్తి వియ్యంకులు. ఆ సమయంలో నేపాల్ చక్రవర్తి తంజావూరు చక్రవర్తికి బంగారు, వెండి ఆభరణాలు, మేలిమి పట్టుపీతాంబరాలతో పాటు అతిపెద్ద సాలగ్రామ శిల కూడా కానుకలుగా సమర్పించారు. కొన్నేళ్లుగడిచాయి. మరాఠీ చక్రవర్తి ప్రతాప సింహరాజు పరిపాలిస్తున్నప్పుడు ఆ సాలగ్రామ శిలను చూశారు. దానిని చూడగానే ఆయన తనువు పులకరించింది. సాధారణంగా సాలగ్రామ శిలలు అరచేతిలో ఇమిడేంత, అంతకంటే కాస్త పెద్ద సైజులో ఉంటాయి. కాగా తంజావూరు చక్రవర్తికి కానుకగా లభించిన సాలగ్రామం శిల చాలా పెద్దది. ఆ భారీ శిలను ప్రముఖ శిల్పులతో అందమైన శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణ, సుగ్రీవుడి విగ్రహాలుగా తయారు చేయడానికి సంకల్పించారు. అదే సమయంలో శ్రీరాముడికి రాజగోపురంతో కూడిన అందమైన ఆలయాన్ని కూడా నిర్మించారు. ఆ ఆలయంలో కోదండరాముడు సాలగ్రామం మూలవిరాట్టుగా భక్తులను అనుగ్రహిస్తున్నారు. శ్రీరాముడితోపాటు సీతాదేవి, లక్ష్మణుడు, సుగ్రీవుడు కూడా కొలువై ఉన్నారు.

సీతారాములతో సుగ్రీవుడు...

సాధారణంగా శ్రీరామాలయంలో సీతారామలక్ష్మణ సమేతంగా ఆంజనేయుడికి పూజలు జరుగుతాయి. అయితే ఈ ఆలయంలో ఆంజనేయుడికి బదులుగా వానర చక్రవర్తి సుగ్రీవుడు కొలువుదీరి ఉండటం విశేషం. ఇక ప్రదక్షిణ ప్రాకారంలో శంఖు, చక్రధారిగా తుంబిక్కై ఆళ్వార్ సన్నిధి, మహా సుదర్శనమూర్తి సన్నిధులున్నాయి. ఈ మహా సుదర్శనమూర్తి శోడష హస్తాలలో వివిధ రకాల ఆయుధాలు ధరించి భక్తుల్లో ధైర్యాన్ని కలిగించేలా గాంభీర్యంగా దర్శనమిస్తారు. సుదర్శనమూర్తిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తే ఆయురారోగ్యాలను ప్రసాదిస్తారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ ఆలయానికి పొన్న చెట్టు స్థలవృక్షం కాగా, దాని అడుగుభాగాన శ్రీరాముడి పవిత్రపాదాలు ప్రతిష్ఠించి ఉంది. ఇక జయవీర ఆంజనేయుడికి ప్రత్యేకంగా సన్నిధి ఉంది. ఈ ఆలయంలో ప్రతియేటా శ్రీరామ నవమి వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతాయి. ఆంగ్ల సంవత్సరాది, తమిళ ఉగాది, సంక్రాంతి, దీపావళి తదితర పర్వదినాల్లోను ప్రత్యేక ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రతి బుధ, శనివారాల్లో భక్తులు అత్యధిక సంఖ్యలో ఈ ఆలయాన్ని దర్శిస్తున్నారు.


ఆలయ ముఖమండపం - సీతారామలక్ష్మణులు - సీతమ్మ - సీతారామ లక్ష్మణ, సుగ్రీవులు (ఉత్సవమూర్తులు) - స్వామివారి సాలగ్రామ విగ్రహం, ఆలయ ధ్వజస్తంభం

ఎలావెళ్ళాలి?

చెన్నై సహా పలు ప్రధాన నగరాల నుంచి తంజావూరుకు రాష్ట్ర రవాణా సంస్థ బస్సులు, ప్రైవేటు బస్సుల నడుపుతున్నారు. తంజావూరు బస్టాండుకు 4 కి.మీ.ల దూరంలో ఉన్న ఈ ఆలయానికి టౌన్ బస్సులు, ఆటోలు, టాక్సీల్లో వెళ్లొచ్చు. సుప్రసిద్ధ పున్నైనల్లూరు మారియమ్మన్ ఆలయ సమీపంలో ఈ ఆలయం ఉండటం విశేషం. ఈ ఆలయాన్ని ప్రతిరోజూ ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మళ్ళీ సాయంత్రం 4 నుండి రాత్రి 8 గంటల వరకు తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.


సంగీత దర్శకుడు సంతోష్ రామ్

'రెడ్ ఫ్లవర్' కోసం హంగేరియన్ ఆర్కెస్ట్రా

నటుడు విఘ్నేష్ హీరోగా ఆండ్రూ పాండియన్ దర్శకత్వంలో శ్రీ కాళికాంబాల్ పిక్చర్స్ సమర్పణలో నిర్మాత కె.మాణిక్యం నిర్మిస్తున్న 'రెడ్‌ఫ్లవర్' చిత్రం బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ కంపోజింగ్ కోసం హంగేరియన్ ఆర్కెస్ట్రా పనిచేస్తుంది. సంతోష్ రామ్ సంగీతం అందిస్తున్నారు. అయితే, నేపథ్య సంగీతం బలంగా ఉండాలని భావించిన దర్శక నిర్మాతలు ఇందుకోసం హంగేరియన్ ఆర్కెస్ట్రా సాయం తీసుకున్నారు. వైవిధ్యభరితమైన యాక్షన్ చిత్రంగా రూపొందిస్తున్నారు. ఇప్పటికే చిత్ర చిత్రీకరణ పూర్తి చేసుకోగా, నేపథ్య సంగీతం, వీఎఫ్ఎక్స్ జరుగుతున్నాయి. ఈ విషయంపై సంగీత దర్శకుడు సంతోష్ రామ్ మాట్లాడుతూ, 'ఇది నేను చేసే తొలి ప్రాజెక్టు. నా ప్రతిభను నిరూపించుకునేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నాను. 'రెడ్‌ఫ్లవర్' అనేది ఫ్యూచరిస్టిక్ మూవీ. అందుకే సైన్స్ ఫిక్షన్‌కి సరిపోయే ఆధునిక, వినూత్నమైన ఆర్కెస్ట్రా స్కోర్ అందించేందుకు హంగేరియన్ సంగీత బృందంతో కలిసి పనిచేస్తున్నాను' అని తెలిపారు.

కోలీవుడ్‌లోకి మాలీవుడ్ బ్యూటీ

మాలీవుడ్‌కు చెందిన సమృద్ధి తార అనే హీరోయిన్ కోలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు. తమిళంలో తెరకెక్కుతున్న 'మైయల్' చిత్రంలో ఆమె కథానాయిక పాత్ర పోషిస్తున్నారు. ఎమోషనల్ డ్రామాగా రూపొందుతున్న తన మొదటి కోలీవుడ్ చిత్రంలోనే ఒక మంచి ప్రామిసింగ్ క్యారెక్టర్ లభించడంపై ఆమె సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి సినిమా నేపథ్యం లేకుండా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన సమృద్ధి అటు మలయాళంలో రాణిస్తూ, ఇపుడు కోలీవుడ్‌లో తన ప్రతిభ నిరూపించుకునేందుకు ఉవ్విళ్ళూరుతున్నారు. 'మైయల్' చిత్రంలో నటించిన అనుభూతిపై ఆమె స్పందిస్తూ, 'ఈ చిత్రంలో సమకాలీన వాస్తవికతతో కూడిన అనేక అంశాలు ప్రతిధ్వనించేలా భావోద్వేగాలున్నాయి. ఇలాంటి సినిమాలో నటించేందుకు అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు ఎప్పటికీ రుణపడివుంటాను' అని పేర్కొన్నారు.


సమృద్ధి తార

గౌతం చిత్రానికి రాజు సంభాషణలు

యువ హీరో గౌతం కార్తీక్ తన పుట్టిన రోజు సందర్భంగా కొత్త ప్రాజెక్టు ప్రకటించారు. ఈ చిత్రానికి ప్రముఖ దర్శకుడు రాజు మురుగన్ సంభాషణలు అందిస్తున్నారు. ఎంజీ స్టూడియోస్ పతాకంపై ఏబీవీ మారన్, 'డాడా' ఫేం గణేష్ కె బాబు సంయుక్తంగా ఈ సినిమా నిర్మిస్తున్నారు. దర్శకుడు రాజు మురుగన్ వద్ద సహాయ దర్శకుడిగా పనిచేసిన దినా రాఘవన్ ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ ప్రాజెక్టు వివరాలను వెల్లడిస్తూ, 'దక్షిణ చెన్నైలోని తరమణి వంటి ప్రాంతంలో రాజకీయాలను ఒక సాధారణ ఘటన ద్వారా, పొలిటికల్ సెటైర్‌గా చెప్పే ప్రయత్నం చేస్తున్నాం. రాజకీయాలు, సామాన్యుడి నిజ జీవితం కలగలిసిన ఈ చిత్రంలో వినోదానికి కూడా అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. ఇందులో హీరో పాత్ర ఒక ఏరియా కుర్రోడు రాజకీయాల్లోకి ఎలా వచ్చాడు. ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నాడన్నది ప్రధాన కథాంశంగా ఉంటుంది. మనింట్లో కుర్రాడిని తలపించేలా గౌతం పాత్ర ఉంటుంది. జీకే19 అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నాం. ఇందులో నటించే నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం' అని పేర్కొన్నారు.


రాజు మురుగన్, గౌతం కార్తీక్ తదితరులు

యూనివర్శల్ సబ్జెక్టుతో 'ఓం శివం'

● దర్శకుడు ఆల్విన్


'ఓం శివం' చిత్ర బృందం

ఒక యదార్థ సంఘటనతో అన్ని భాషల ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యేలా యూనివర్శల్ సబ్జెక్టుగా 'ఓం శివం' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్టు దర్శకుడు ఆల్విన్ వెల్లడించారు. దీపా ఫిలిమ్స్ బ్యానరుపై కేఎన్ కృష్ణ నిర్మించిన ఈ చిత్రం తమిళం, తెలుగు, హిందీ భాషల్లో తెరకెక్కుతోంది. భార్గవ్ అనే యువకుడు తొలిసారి హీరోగా పరిచయమవుతుండగా, హీరోయిన్‌గా విరానిక నటించారు. శాండల్‌వుడ్ హీరోయిన్ విరానిక ఈ చిత్రం ద్వారా కోలీవుడ్‌లోకి అడుగుపెడుతోంది.. ఇతర పాత్రల్లో లక్ష్మి సిద్ధయ్య, అపూర్వశ్రీ, పాల్‌రాజ్, ఉగ్రం రవి, వరదన్, రోబో గణేష్ తదితరులు నటించారు. ఈ సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ, 'ఒక యదార్థ కథాంశంతో తెరకెక్కిస్తున్నాం. ఈ రొమాంటిక్ జానర్‌లో నేటి యువత ప్రేమ కోసం ఎంత వరకు వెళ్ళడానికైనా సిద్ధపడుతుంటారు. ఈ సినిమాలో హీరో పాత్ర పేరు శివుడు. శివుడు ఎంతో యాక్టివ్, అగ్రెసివ్‌గా ఉంటారు. అన్ని భాషలకు సరిపోయేలా ఈ టైటిల్ ఖరారు చేశాం. మాండ్య, మైసూర్, కృష్ణగిరి తదితర ప్రాంతాల్లో 45 రోజుల్లో షూటింగ్ పూర్తి చేసి, ప్రమోషన్ కార్యక్రమాలను చేపట్టాం. ఫస్ట్‌లుక్ త్వరలోనే విడుదల చేయనున్నాం. ఈ యేడాదిలోగా సినిమా విడుదల చేయాలన్న సంకల్పంతో ఉన్నాం' అని పేర్కొన్నారు.

సవీత దంత వైద్య కాలేజీ ప్రొఫెసర్‌కు అవార్డు


రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న దృశ్యం

అడయార్, సెప్టెంబరు 12: నగరంలోని సవీత దంత వైద్య కాలేజీ, ఆస్పత్రికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ ఏఎస్ స్మిలిన్ గిరిజకు ప్రతిష్ఠాత్మక మైన నేషనల్ టీచర్స్ అవార్డు వరించింది. ఈ దంత వైద్య కాలేజీలో మైక్రోబయాలజీ శాఖాధ్యక్షురాలిగా ఆమె కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఆమెకు నేషనల్ టీచర్స్ అవార్డు-2024 వరించింది. తాజాగా ఢిల్లీ విజ్ఞాన భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ అవార్డు స్వీకరించారు. 2024 సంవత్సరానికిగాను హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ విభాగంలో ఆమెకు ఈ అవార్డు వరించింది. ఈ అవార్డు ఎంపిక కోసం వచ్చిన ఎంట్రీలను రెండు రౌండ్లలో మూల్యాంకనం చేపట్టిన తర్వాత చివరగా జ్యూరీ సభ్యులు ఆమె పేరు ఎంపిక చేసినట్టు సవీత దంత వైద్య కాలేజీ ఆస్పత్రి విడుదల చేసిన ఓ పత్రికా ప్రకటనలో పేర్కొంది.


వేలూరు సమీపం కందనేరిలో జరిగిన నరువి ఆస్పత్రి అధ్యక్షుడు జీవీ సంపత్ కుమారుడి వివాహ వేడుకల్లో పాల్గొన్న ఆశ్రమాల్లో నివసిస్తున్న అనాథ పిల్లలు, వృద్ధులు

ఫీనిక్స్ సిటీలో వివేక్ ఓబెరాయ్ సందడి


మోడళ్ళతో వివేక్ ఓబెరాయ్

అడయార్, సెప్టెంబరు 12: స్థానిక వేళచ్చేరిలోని ఫీనిక్స్ మార్కెట్ సిటీలో బాలీవుడ్ నటుడు వివేక్ ఓబెరాయ్ సందడి చేశారు. డెనిమ్ ఫెస్ట్ కోసం ప్రఖ్యాత కొరియోగ్రాఫర్ గణేష్ గురుంగ్ నిర్వహించిన డైమండ్స్ అండ్ డెనిమ్స్ ఈవెంట్‌లో ఆయన పాల్గొన్నారు. ఇందులో వివేక్ ఓబెరాయ్.. తన బ్రాండ్ సాలిటారియో నుంచి హైరేంజ్ డెనిమ్, వజ్రాలను ధరించి ఇతర మోడళ్ళతో కలిసి ర్యాంప్ వాక్ చేశారు. ఈ సందర్భంగా ఆయన చెన్నై నగరంతో తనకున్న అనుభవాలను, చిరస్మరణీయమైన జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. చెన్నై మహానగరంలో ప్రముఖ షాపింగ్ గమ్యస్థానాల్లో ఒకటిగా ఫీనిక్స్ మార్కెట్ మాల్ గుర్తింపు పొందిన విషయం తెల్సిందే. ఇందులో జరిగిన ఈ ఈవెంట్‌కు హైఫ్యాషన్, స్టార్ స్టడెడ్ గ్లామర్ సమ్మేళనంతో ఎంతగానో ఆకర్షించింది.

శక్తి అమ్మ ఆశీస్సులు పొందిన కర్ణాటక గవర్నర్

వేలూరు, సెప్టెంబరు 12: స్థానిక శ్రీపురంలోని స్వర్ణాలయాన్ని ప్రతి రోజు వేలాది మంది సందర్శిస్తుంటారు. ఈ నేపథ్యంలో, కర్ణాటక గవర్నర్ దావర్‌చంద్ గెహ్లాట్ గురువారం కుటుంబ సభ్యులతో స్వర్ణాలయాన్ని సందర్శించారు. గవర్నర్‌కు ఆలయ నిర్వాహకులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం గవర్నర్ శక్తి అమ్మ ఆశీస్సులు అందుకున్నారు. కార్యక్రమంలో స్వర్ణాలయం డైరెక్టర్ సురేష్‌బాబు, నారాయణి పీఠం మేనేజర్ సంపత్ తదితరులున్నారు.


శక్తి అమ్మ వద్ద ఆశీస్సులు పొందుతున్న కర్ణాటక గవర్నర్ దావర్‌చంద్ గెహ్లాట్

ఏపీ వరద బాధితులను ఆదుకుంటాం

● మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్

ప్యారీస్, సెప్టెంబరు 12: ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల సంభవించిన వరదల్లో నష్టపోయిన బాధితులను ఆదుకుంటామని మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక మేనేజింగ్ ట్రస్టీ డా.జీకే దాస్ పేర్కొన్నారు. స్థానిక చూలమేడు తిరువేంగడపురంలో మదర్ హౌస్‌లోని ట్రస్ట్ ప్రధాన కార్యాలయంలో గురువారం ఏపీలో వరద ప్రభావిత ప్రాంతాలైన విజయవాడ, ఉభయ గోదావరి జిల్లాల్లోని బాధితుల కోసం సిద్ధం చేసిన 200 చీరలు, 200 టీ-షర్టులు, 200 లుంగీలు, 600 బెడ్‌షీట్లు, పిల్లల బట్టలు తదితర 12 బండిళ్లను విజయవాడలోని ట్రస్ట్ బ్రాంచి కార్యాలయానికి వాహనంలో తరలించారు. ఈ సందర్భంగా జీకే దాస్ మాట్లాడుతూ... కుల మత రాజకీయాలకు అతీతంగా పేదల అభ్యున్నతి కోసం పాటుపడిన మదర్ థెరిస్సా ఆశయాలకు అనుగుణంగా తమ ట్రస్ట్ సమాజానికి ఉచితంగా సేవలందిస్తోందన్నారు. ఇటీవల కేరళ వయనాడు బాధిత ప్రాంతాల్లో సహాయాలు పంపిణీ చేశామని ఆయన తెలిపారు. ఏపీ బాధితులకు విజయవాడలోని ట్రస్ట్ నిర్వాహకులు ఆనంద్ బాబు, ప్రవీణ్‌కృష్ణ కుమార్ సహాయాలు అందజేస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీ ఎ.జేవియర్, కేవీ పాండ్యరాజన్, రిచర్డ్ రీగన్, అబూబకర్, సులైమాన్, వల్లి తదితరులు పాల్గొన్నారు.


ఏపీ వరద బాధితులకు అందజేసే సహాయాలతో డా.జీకే దాస్, జేవియర్ తదితరులు